ఆదర్శ పాఠశాలల పనులను..
వేగంగా పూర్తి చేయాలి

- ఎంబీ రికార్డ్ చేసి బిల్లుల చెల్లింపులకు చర్యలు తీసుకోవాలి
- పనుల పురోగతి సమీక్షలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

గణాంకాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఖమ్మం కలెక్టర్, జిల్లా అధికారులు

మామిళ్లగూడెం, జూలై 11: జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. ఈ పాఠశాలల పనుల పురోగతిపై విద్య, ఇంజినీరింగ్ శాఖలు, మండల సమాఖ్యలతో ఐడీవోసీలో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమై తరగతులు కొనసాగుతున్నందున అధికారులు మరింత శ్రద్ధ తీసుకొని పనులు పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీరాజ్ విభాగానికి 423 పాఠశాలలు కేటాయించగా వాటిల్లో 248 పనులు పూర్తయ్యాయని, మరో 175 చోట్ల పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో 51 పాఠశాలల పనులు చేపట్టగా వాటిల్లో 30 చోట్ల పనులు పూర్తయ్యాయని, 21 చోట్ల వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. విద్యాశాఖ ఇంజినీరింగ్ విభాగం ద్వారా 177 పాఠశాలల్లో పనులు చేపట్టగా వాటిల్లో 104 చోట్ల పనులు పూర్తయ్యాయని, 73 చోట్ల పురోగతిలో ఉన్నాయని అన్నారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా 260 పాఠశాలల్లో పనులు చేపట్టగా.. 112 చోట్ల పూర్తయ్యాయిని, 148 చోట్ల పురోగతిలో ఉన్నాయని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా 44 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టగా.. 14 చోట్ల పూర్తయ్యాయని, 30 చోట్ల పురోగతిలో ఉన్నాయని వివరించారు. నిధులకు ఎలాంటి సమస్య లేనందున పూర్తయిన పనులకు వెనువెంటనే ఎంబీ రికార్డ్ చేసి చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే నెల రోజుల్లో అన్ని పాఠశాలల పనులు పూర్తయ్యేలా పకడ్బందీ కార్యాచరణ చేయాలని సూచించారు. అనంతరం జిల్లా ప్రణాళిక శాఖ రూపొందించిన 2022-23 జిల్లా గణాంకాల హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించారు. ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, డీఆర్డీవో సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు వినోద్, సోమశేఖరశర్మ, శ్రీనివాస్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లా ఆదర్శంగా ఉండాలి..
వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ, కేంద్ర ప్రభారీ అధికారి యోగితారాణా

మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ యోగితారాణా

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 11 (నమస్తే తెలంగాణ) : దేశంలోని యాస్పిరేషన్ జిల్లాలకు భద్రాద్రి జిల్లా ఆదర్శంగా ఉండాలని వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ, కేంద్ర ప్రభారీ అధికారి డాక్టర్ యోగితారాణా అన్నారు. ఐడీవోసీ సమావేశ మందిరంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌తో కలిసి అధికారులతో యాస్పిరేషన్ జిల్లా అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంపూర్ణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా యాస్పిరేషన్ జిల్లాలకు భద్రాద్రి జిల్లా ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఈ జిల్లాతో తనకు ప్రత్యేక అనుబంధం ఉన్నదని, తన మొదటి పోస్టింగ్ భద్రాచలంలో చేశానని ఆమె గుర్తు చేశారు. జిల్లా అధికారులందరూ ప్రత్యేక దృష్టి సారించి జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. గుండాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సంపూర్ణ అభియాన్ లక్ష్యాలను వందశాతం సాధించాలన్నారు. జిల్లాలోని గ్రంథాలయాల్లో అంధ, చెవిటి, మూగ పిల్లల కోసం ప్రత్యేక ఛాంబర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. సమీక్షలో కేంద్ర ప్రభారీ కార్యదర్శి పవన్, అదనపు కలెక్టర్ విద్యాచందన, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు, సీపీవో శ్రీనివాసరావు, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అర్జున్‌రావు, డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్, చంద్రమౌళి, డీఈవో వెంకటేశ్వరాచారి, మహిళా, శిశు సంక్షేమాధికారి విజేత, పశు సంవర్ధక శాఖ అధికారి పురంధేశ్వర్, జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, గుండాల ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఈవో పాల్గొన్నారు.

గుంతల వంతెన!

- తరచూ ప్రమాదాలతో వాహనదారుల అవస్థలు
- మరమ్మతుల గురించి పట్టించుకోని అధికారులు

పినపాక వంతెనపై ఏర్పడిన గుంతలు

వైరారూరల్, జూలై 11 : స్టేజీ పినపాక సమీపంలోని వంతెన మీదుగా నిత్యం వేలాది భారీ వాహనాలు, బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్తుంటాయి. జాతీయ రహదారి కావడంతో ఎక్కువగా వేగానికి ప్రాధాన్యం ఇస్తూ వాహనాలను నడుపుతుంటారు. ఈ మార్గంలో కొత్తగా వెళ్లే వాహనదారులకు మార్గమధ్యలో ఉన్న వంతెనపై గుంతలు ఎక్కువగా ఉన్నాయని దగ్గరికి వెళ్లే వరకూ కనిపించవు. ఈ క్రమంలోనే సడన్ బ్రేకులు వేయడం వల్ల వెనుక వచ్చే వాహనాలు ఒకదానికొకటి ఢీకొని తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎత్తయిన వంతెన కావడం.. చుట్టూ పటిష్టమైన రెయిలింగ్ లేకపోవడంతో పెను ప్రమాదాలు వాటిల్లే అవకాశం కూడా ఉంది. వివరాల్లోకి వెళితే.. వైరా నుంచి తల్లాడ వెళ్లే మార్గంలో స్టేజీ పినపాక వరకు ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. రహదారితోపాటు వంతెనపై ఉన్న గుంతల్లోపడి ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు సైతం ఉన్నాయి. పలుమార్లు గుంతల విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకెళ్లినా నామమాత్రపు మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ గుంతలమయమైన మార్గాన్ని వంతెనను బాగు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

మెరిట్ ఆధారంగానే పోస్టులు భర్తీ చేస్తాం..
జిల్లా ఉపాధి కల్పన అధికారి విజేత

ఉపాధి కల్పనాధికారి విజేత

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 11 (నమస్తే తెలంగాణ) : నిరుద్యోగ అభ్యర్థులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, మెరిట్ ఆధారంగానే ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని జిల్లా ఉపాధి కల్పనాధికారి వేల్పుల విజేత స్పష్టం చేశారు. గురువారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 155 పోస్టుల భర్తీ కోసం జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. ఆయా పోస్టులను అభ్యర్థుల అర్హత, ప్రతిభ ఆధారంగానే భర్తీ చేస్తామని పేర్కొన్నారు. డబ్బులు ఇస్తే ఉద్యోగం వస్తుందనే అపోహలో నిరుద్యోగులు మోసపోవద్దని, ఎవరైనా డబ్బులు ఇవ్వాలని అడిగినా వెంటనే తమకు తెలియజేయాలని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళలు ఆర్థికంగా శక్తిమంతులు కావాలి
అందుకోసమే 'మహిళా శక్తి' పథకం: ఖమ్మం కలెక్టర్

మామిళ్లగూడెం, జూలై 11: మహిళలను ఆర్థికంగా శక్తిమంతులను చేయడమే 'మహిళా శక్తి' పథకం ముఖ్య ఉద్దేశమని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. 'మహిళా శక్తి' పథకం అమలుపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, ఏపీఎంలు, సీఏలు, మహిళా సమాఖ్య సంఘాల బాధ్యులతో ఐడీవోసీలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా శక్తి పథకాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం కోసం, మహిళల సామాజిక భద్రత కోణంలో సంఘాలను బలోపేతం చేయడం కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, మండల మహిళా సమాఖ్యలు బాధ్యులు సొంతంగా నిర్వహించగలిగే యూనిట్లను ఎంచుకోవాలని సూచించారు. ఆయా యూనిట్ల నిర్వహణపై అనుభవం ఉంటే లాభసాటి అవుతుందని అన్నారు. బ్యూటీ పార్లర్, నాటుకోళ్ల పెంపకం, పాడి గేదెలు, టెంట్‌హౌస్ తదితర యూనిట్లపై చర్చించారు.

మళ్లీ రైతుల పోరుబాట

- దేశవ్యాప్త నిరసనలకు సమాయత్తం
- ఎంఎస్పీకి చట్టబద్ధత, రుణమాఫీ తదితర డిమాండ్ల సాధనకు ఉద్యమం
- సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటన

న్యూఢిల్లీ, జూలై 11: రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మళ్లీ ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం) గురువారం ప్రకటించింది. 2020-21లో కేంద్రం తెచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టిన రైతు సంఘాల ఐక్య వేదిక సంయుక్త కిసాన్ మోర్చా సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను ఎస్కేఎం గురువారం ప్రకటించింది. మళ్లీ ఉద్యమాన్ని పునఃప్రారంభించాలని నిర్ణయించినట్టు పేర్కొన్నది. ముఖ్యంగా పంటల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలనే డిమాండ్‌తో ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసినట్టు తెలిపింది. 2021 డిసెంబర్ 9న రైతు సంఘాలతో జరిగిన చర్చల్లో కేంద్రం చేసుకున్న ఒప్పందంలోని అంశాలను నెరవేర్చాలని డిమాండ్ చేసింది. జూలై 16 నుంచి 18 వరకు ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత సహా ఎంపీలందరినీ కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించనున్నట్టు తెలిపింది. ఉద్యమం సమయంలో మరణించిన అన్నదాతల గౌరవార్థం ఢిల్లీ సరిహద్దుల్లోని టిక్రి, సింఘు వద్ద స్మారకాలను నిర్మించనున్నట్టు వెల్లడించింది. అలాగే 2021లో ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖీరీలో కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా కాన్వాయ్ దూసుకెళ్లడంతో ప్రాణాలు కోల్పోయిన అన్నదాతలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది.

ఈసారి దేశవ్యాప్త ఉద్యమం

ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ) నుంచి భారత్ బయటకు రావాలని, వ్యవసాయ రంగంలోకి బహుళ జాతి సంస్థలను అనుమతించవద్దని ఎస్కేఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆగస్టు 9న 'క్విట్ ఇండియా డే'ను 'కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే'గా నిర్వహిస్తామని, దేశవ్యాప్తంగా తమ డిమాండ్ల సాధనకు ప్రదర్శనలు నిర్వహిస్తామని ప్రకటించారు. తమ డిమాండ్ల సాధనకు ఇక కొత్త పద్ధతుల్లో ఉద్యమాన్ని నడిపించాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. ఈసారి ఢిల్లీకి ర్యాలీ చేపట్టడం కాకుండా దేశవ్యాప్త నిరసనలు తెలుపుతామని, ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్ము కశ్మీర్, హర్యానా రాష్ట్రాలపై ప్రధాన దృష్టి సారిస్తామని ఎస్కేఎం నేతలు ప్రకటించారు.

నీట్‌పై విచారణ జూలై 18కి వాయిదా

పేపర్ లీక్ సూత్రధారి రాకీ అరెస్టు

న్యూఢిల్లీ, జూలై 11: నీట్-యూజీ పరీక్షలో అక్రమాలపై విచారణను జూలై 18కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని, అక్రమాలపై విచారణ జరిపించాలని, పరీక్షను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను కలిపి సుప్రీం కోర్టు విచారిస్తున్నది. ఈ పిటిషన్లపై స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం, పరీక్ష నిర్వహించిన జాతీయ పరీక్ష సంస్థ(ఎన్టీఏ)ను ఇంతకుముందు కోర్టు ఆదేశించింది. బుధవారం కేంద్రం, ఎన్టీఏ వేర్వేరుగా స్పందనను తెలియజేస్తూ అఫిడవిట్లు దాఖలు చేశాయి. గురువారం ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై విచారణ ప్రారంభించింది. పరీక్షలో అక్రమాలపై సీబీఐ జరుపుతున్న విచారణ పురోగతిపై తమకు నివేదిక అందినట్టు కోర్టు పేర్కొన్నది. అయితే, తమకు కేంద్రం, ఎన్టీఏ దాఖలు చేసిన అఫిడవిట్లు అందలేదని పలువురు పిటిషన్‌దారులు ధర్మాసనానికి తెలిపారు. దీంతో జూలై 15కు విచారణ వాయిదా వేస్తామని ధర్మాసనం చెప్పింది. అయితే, ఆ రోజు తాను అందుబాటులో ఉండనని కేంద్ర ప్రభుత్వ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. దీంతో విచారణను జూలై 18కి కోర్టు వాయిదా వేసింది. కాగా, నీట్‌లో సామూహిక మాల్‌ప్రాక్టీస్ జరగలేదని, కాబట్టి మళ్లీ పరీక్ష నిర్వహించాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం బుధవారం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

ఆడతోడు కోసం 1.3 కిలోమీటర్లు
ఈదిన మగసింహాలు

న్యూఢిల్లీ: ఆడతోడు కోసం అలమటించి పోయిన రెండు సోదర సింహాలు ఓ నదిని 1.3 కిలోమీటర్లు ఈది అవతలి ఒడ్డుకు చేరుకున్నాయి. ఉగాండాలోని క్వీన్ ఎలిజబెత్ నేషనల్ పార్క్‌లో జరిగిందీ ఘటన. ఆ నది మొత్తం మొసళ్లు, నీటి ఏనుగులతో నిండి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ లెక్కచేయకుండా ఈదాయి. రెండు సింహాలలో ఒకటైన జాకబ్ క్వీన్ ఎలిజబెత్ పార్కులో పదేండ్లుగా నివసిస్తున్నది. ఇది వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని కాలు కోల్పోయింది. అయినప్పటికీ సోదర సింహంతో కలిసి రెండు సరస్సులను కలిపే జలమార్గాన్ని విజయవంతంగా దాటింది. పార్కులో ఆడసింహాల కోసం విపరీతమైన పోటీ ఉంది. ఈక్రమంలో ఓ ఆడతోడు కోసం మరో మగ సింహాల గుంపుతో పోరాడి ఓడిపోయాయి. ఆ తర్వాత ఇవి రెండూ నదికి ఆవలివైపున ఉన్న ఆడ సింహాల కోసం ప్రమాదకరమైన ప్రయాణం చేసి ఉండొచ్చని ఆస్ట్రేలియాకు చెందిన అధ్యయనకర్త అలెక్స్ బ్రాజ్‌కోవ్స్కీ తెలిపారు.

రాజ్‌నాథ్‌కు అస్వస్థత



న్యూఢిల్లీ: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అస్వస్థతకు గురయ్యారు. అకస్మాత్తుగా ఆరోగ్యం క్షీణించడంతో ఆయనను గురువారం ఉదయం ఎయిమ్స్‌లోని న్యూరో సర్జరీ డిపార్ట్‌మెంట్‌లో చేర్పించారు. ఎయిమ్స్ మీడియా సెల్ ఇన్‌చార్జ్ డాక్టర్ రీమా దాదా తెలిపిన వివరాల ప్రకారం, రాజ్‌నాథ్ ఆరోగ్యం నిలకడగా ఉంది. ఆయనను వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. నడుము నొప్పి రావడంతో ఆయనను ఎయిమ్స్‌లో చేర్పించారు.

బిడ్డను కంటే 92 వేలు
- రష్యాలోని కరేలియా అధికారుల ఆఫర్

మాస్కో, జూలై 11: తమ దేశంలో సంతానోత్పత్తిని పెంచడానికి రష్యా పలు చర్యలు చేపడుతున్నది. అందులో భాగంగా దేశ వాయువ్య ప్రాంతంలోని రిపబ్లిక్ ఆఫ్ కరేలియా అధికారులు ఒక వినూత్న ఆఫర్‌ను ప్రకటించారు. స్థానిక యూనివర్సిటీ, కాలేజీలలో చదివే 25 ఏండ్ల లోపు యువతులు ఆరోగ్యవంతమైన బిడ్డను కనుక ప్రసవిస్తే వారికి రూ.92 వేలు బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. దేశంలో సంతానోత్పత్తి రేటును పెంచడానికి ప్రవేశపెట్టే ఈ పథకం వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమలులోకి వస్తుందని తెలిపారు. ఇప్పటికే రష్యా, దాని రీజియన్ ప్రాంతాలు జననాల రేటును పెంచడానికి పలు చర్యలు చేపట్టాయి. ఇటీవల ఉక్రెయిన్‌తో యుద్ధంతో రష్యాలోని పలువురు యువకులు మరణించగా, బలవంతంగా సైన్యంలోకి తీసుకుంటారన్న భయంతో చాలామంది దేశాన్ని వదిలి పారిపోయారు. మాస్కోటైమ్స్ కథనం ప్రకారం ఇప్పటికే దేశంలో గర్భనిరోధక సాధనాలైన కండోమ్‌లు, మాత్రలు తదితర వాటిపై ప్రభుత్వం నిషేధం విధించింది. కాగా, ప్రతి రష్యా మహిళ 8 మందికి జన్మనివ్వాలని గత ఏడాది డిసెంబర్‌లో పుతిన్ విజ్ఞప్తి చేశారు.

సౌదీ విమానం ల్యాండింగ్ గేర్‌లో మంటలు
విమానం దిగుతుండగా ఘటన ● పాక్‌లో తప్పిన పెను ప్రమాదం

విమానం వద్దకు చేరుకుని మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక నిరోధకాలను ప్రయోగించారు. దీంతో మంటలు ఆగిపోయి పెద్ద ప్రమాదం తప్పింది. తర్వాత ప్రయాణికులు, సిబ్బందిని జారుడు స్లయిడ్ ద్వారా విమానంలోంచి దింపారు.

ఇస్లామాబాద్, జూలై 11: పాకిస్థాన్‌లోని పెషావర్ విమానాశ్రయంలో సౌదీ ఎయిర్ లైన్స్ విమానానికి భారీ ప్రమాదం తప్పింది. 276 మంది ప్రయాణికులు, 21 మంది సిబ్బందితో రియాద్ నుంచి వస్తున్న ఈ విమానం దిగే సమయంలో ల్యాండింగ్ గేర్‌లో మంటలు చెలరేగాయి. విపత్తు నివారణ సిబ్బంది అప్రమత్తతతో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. గురువారం ఈ విమానం పెషావర్ బచ్చా ఖాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో దిగే సమయంలో ఎడమ వైపు ల్యాండింగ్ గేర్ నుంచి పొగ, నిప్పురవ్వలు రావడాన్ని గమనించిన ట్రాఫిక్ కంట్రోలర్లు పైలట్‌ను హెచ్చరించారు. తర్వాత ఎయిర్‌పోర్టులోని అగ్నిమాపక, ఇతర విపత్తు నివారణ విభాగాలను కూడా అప్రమత్తం చేశారు. పౌర విమానయాన విభాగం (సీఏఏ) సిబ్బంది వెంటనే

ఢీకొనబోయిన రెండు విమానాలు

న్యూయార్క్, జూలై 11: అమెరికాలోని న్యూయార్క్‌లో ఆకాశంలో రెండు విమానాలు ఢీకొనబోయాయి. న్యూయార్క్‌లోని సిరక్యూస్‌లో పోలీస్ శాఖకు చెందిన హెలికాప్టర్ వాహనంలోని డాష్ కెమెరా ఈ దృశ్యాన్ని బంధించింది. ఈ నెల 8న ఈ రెండు ప్రయాణికుల విమానాలు ఇంచుమించు ఒకదానికొకటి ఢీకొనేంత దగ్గరగా వచ్చినా వెంట్రుకవాసిలో ప్రమాదం నుంచి బయటపడ్డాయి. సిరక్యూస్ హన్‌కాక్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో ఒకే రన్‌వేపైకి ఏకకాలంలో ల్యాండింగ్, టేకాఫ్‌కు అనుమతి ఇస్తూ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది చేసిన తప్పిదం కారణంగానే ఇది సంభవించి ఉంటుందని భావిస్తున్నారు.

విశేష పత్రం
పార్ట్-II సెక్షన్ 3 సబ్‌సెక్షన్ (ii)
రైల్వే మంత్రిత్వ శాఖ
(దక్షిణ మధ్య రైల్వే)
ప్రకటన
సికింద్రాబాద్, 27 జూన్ 2024
PUB/0667

S.O.2624(E)-రైల్వేల చట్టం 1989 (24 ఆఫ్ 1989)లోని సెక్షన్ 20Aలోని సబ్-సెక్షన్ (1) (ఇక మీదట సదరు చట్టంగా నిర్దేశించబడును) ద్వారా సంక్రమించిన అధికారాల్ని వినియోగించుకుంటూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్ జిల్లాలో "దోర్నకల్ మరియు భద్రాచలం స్టేషన్ల మధ్య రైల్వే లైన్ డబ్లింగ్" స్పెషల్ రైల్వే ప్రాజెక్ట్ అమలు కొరకు దిగువ షెడ్యూలులో ఇవ్వబడిన సంక్షిప్త వివరణగల భూమి ప్రజోపయోగార్థము కావలసియున్నదని సంతృప్తి చెందిన తరువాత సదరు భూమిని సేకరించాలనే ఉద్దేశాన్ని ఇందుమూలముగా ప్రకటిస్తోంది.
పేర్కొన్న భూమిపై ప్రయోజనం గల ఏ వ్యక్తి అయినా, అధికారిక గెజిట్‌లో ఈ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి ముప్పై రోజులలోపు సదరు చట్టంలోని సెక్షన్ 20డిలోని సబ్-సెక్షన్(1) క్రింద పైన తెలిపిన ఉద్దేశానికి సేకరణ మరియు సదరు భూమి వినియోగానికి అభ్యంతరాన్ని తెలపవచ్చును.
అట్టి ప్రతి అభ్యంతరాన్ని సమర్థ ప్రాధికారి అనగా **రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ మహబూబాబాద్** వారికి వ్రాతపూర్వకముగా దానికి గల కారణాలు తెలియజేయవలెను మరియు సమర్థ ప్రాధికారి **రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ మహబూబాబాద్** అభ్యంతరము తెలిపే వ్యక్తికి స్వయంగా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా తెలియజేసేందుకు అవకాశం కల్పిస్తారు మరియు అట్టి అభ్యంతరాలు విచారించిన తరువాత మరియు సమర్థ ప్రాధికారి అవసరమని భావిస్తే తదుపరి విచారణ జరిపిన తరువాత అభ్యంతరాలను అనుమతించుట లేదా అనుమతించకుండా ఉత్తర్వు జారీ చేస్తారు. సదరు చట్టంలోని సెక్షన్ 20(డి) లోని సబ్-సెక్షన్ (2) క్రింద సమర్థ ప్రాధికారిచే ఇవ్వబడే ఏ ఉత్తర్వు అయినా తుదిగా వుంటుంది.
ఈ ప్రకటన పరిధిలో కవర్ చేయబడే భూమి ప్లాన్లు మరియు భూమి ఇతర వివరాలు సమర్థ ప్రాధికారి యొక్క పైన తెలిపిన కార్యాలయంలో లభిస్తాయి మరియు ఆసక్తిగల వ్యక్తులు తనిఖీ చేసుకోవచ్చును.

షెడ్యూల్

ప్యాసింజర్ మరియు ఫ్రైట్ ఫెసిలిటీ కొరకు తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్ జిల్లాలో "దోర్నకల్ మరియు భద్రాచలం స్టేషన్ల మధ్య రైల్వే లైన్ డబ్లింగ్" స్పెషల్ రైల్వే ప్రాజెక్ట్ కొరకు కట్టడాలతో మరియు కట్టడాలు లేకుండా సేకరించనున్న భూమి సంక్షిప్త వివరణ.

గ్రామం: దోర్నకల్ | మండలం: దోర్నకల్ | జిల్లా: మహబూబాబాద్

క్ర సం.	సర్వే నం.	భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణం ఎ.గుం	ట్రైటిల్ రకం	భూమి రకం	భూమి కోల్పోయిన వారి పేరు & తండ్రి/భర్త పేరు	విస్తీర్ణం ఎ.గుం.	నిర్మాణాలు/చెట్లు మొదలైనవి ఏవైనా
1	64/2	0.26 ½	పట్టా	మెట్ట	తేజావత్ మాంగి భర్త హన్మంతి	0.14	చింతపండు చెట్లు-2
					బయ్యా పున్నయ్య తండ్రి వెంకయ్య	0.02	-నిల్-
					బయ్యా పిచ్చయ్య తండ్రి వెంకయ్య	0.02	వేప చెట్లు-1
					బయ్యా వీరన్న తండ్రి పిచ్చయ్య	0.02	-నిల్-
					బయ్యా వెంకన్న తండ్రి పిచ్చయ్య		
					బయ్యా రాము తండ్రి పిచ్చయ్య		
					బయ్యా వెంకటేశ్వర్లు తండ్రి నాగయ్య	0.01 ¼	వేప చెట్టు-1
					ప్రస్తుతం ఉన్న రైల్వే భూమి	0.05 ¼	-నిల్-
2	67/2	0.13	పట్టా	మెట్ట	గండి రామ్మోహన్ రావు తండ్రి సత్య నారాయణ	0.04	-నిల్-
					గండి యశ్వంత్ గౌడ్ తండ్రి బుచ్చి రామయ్య	0.04	వేప చెట్టు-1
					ప్రస్తుత రైల్వే భూమి	0.05	-నిల్-
3	85/2	0.08	పట్టా	మెట్ట	కొంగల లింగస్వామి తండ్రి వెంకటప్పయ్య	0.04	వేప చెట్లు-2
					కేశబోయిన లచ్చయ్య తండ్రి పెద్దులు	0.04	వేప చెట్టు-1
4	86/2	0.00 ¼	పట్టా	మెట్ట	కేశబోయిన లచ్చయ్య తండ్రి పెద్దులు	0.00 ¼	-నిల్-
5	87/1/2	0.04 ½	పట్టా	మెట్ట	కేశబోయిన లచ్చయ్య తండ్రి పెద్దులు	0.04 ½	టేకు చెట్లు-20 వేపచెట్టు-1
6	88/1/2	0.27 ½	పట్టా	మెట్ట	లింగ రమేష్ తండ్రి కృష్ణయ్య	0.09	వేప చెట్టు-1,బావి-1
					భూక్య మీరా తండ్రి సక్రమ్	0.07	జామాయిల్ చెట్లు-20
					బదావత్ క్రాంతి తండ్రి బాబురావు	0.06	-నిల్-
					ధరావత్ సుమతి భర్త వీరభద్రం	0.04	-నిల్-
					ధరావత్ నరేష్ తండ్రి సక్రు	0.01 ½	-నిల్-
				మొత్తం		1.39 ¾	

గ్రామం: పుల్లూరు | మండలం: గార్ల | జిల్లా: మహబూబాబాద్

క్ర సం.	సర్వే నం.	భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణం ఎ.గుం	ట్రైటిల్ రకం	భూమి రకం	భూమి కోల్పోయిన వారి పేరు & తండ్రి/భర్త పేరు	విస్తీర్ణం ఎ.గుం.	నిర్మాణాలు/చెట్లు మొదలైనవి ఏవైనా
1	3/2	0.00 ¼	పట్టా	మాగాణి	సిద్దం వెంకన్న తండ్రి ముత్తయ్య	0.00 ¼	-నిల్
2	14/2	0.05	పట్టా	మాగాణి	సిద్దం వెంకన్న తండ్రి ముత్తయ్య	0.00 ¼	-నిల్-
					నారంరెడ్డి దివాకర్ రెడ్డి తండ్రి యాదగిరి రెడ్డి	0.04 ¾	మామిడి చెట్లు-3
3	16/2	0.16	పట్టా	మాగాణి	కంపాటి అశోక్ తండ్రి ఉపేందర్	0.16	-నిల్-
4	31/2	0.09 ¼	పట్టా	మాగాణి	కంపాటి అశోక్ తండ్రి ఉపేందర్	0.06 ¼	-నిల్-
					గుల్లపెల్లి రాములు తండ్రి వెంకులు	0.02 ¼	-నిల్-
					గరిగోల కోటయ్య తండ్రి లింగయ్య	0.00 ¾	-నిల్-
5	32/2	0.03 ½	పట్టా	మాగాణి	గారిగోల కోటయ్య తండ్రి లింగయ్య	0.03 ¼	-నిల్-
					కథేరసాల వెంకటేశ్వర్లు తండ్రి లక్ష్మీనారాయణ	0.00 ¼	-నిల్-
6	33/2	0.05 ¼	పట్టా	మాగాణి	కథేరసాల వెంకటేశ్వర్లు తండ్రి లక్ష్మీనారాయణ	0.01	-నిల్-
					ఎదులాపురం రామకోటయ్య తండ్రి సత్యం	0.01	-నిల్-
					ఎదులాపురం పుల్లయ్య తండ్రి ముత్తయ్య	0.01	-నిల్-
					ఎదులాపురం రామకో